


***రచనాకాలం: 1995 సంవత్సరం***

*(గత సంచిక తరువాయి)*

**ముకుందం** తండ్రి విఠల్ ముకుందాన్ని పిలిచి అడిగాడు.

"నీ గ్రాడ్యుయేషన్ అయిపోతోంది. తర్వాత ఏం చేద్దామనుకుంటున్నావు?"

"ఎం.బి.ఎ చేయాలని ఉంది నాన్నగారూ?"

"ఎంత చదివినా నీవు చివరికి చేసేది మన వ్యాపారమేగా? ఇంకెందుకూ చదువు? నేనూ పెద్దవాడ్ని అవుతున్నాను. వ్యాపారం చూసుకోవచ్చుగా?"

ముకుందానికి ఎం.బి.ఏ చదవాలన్న కోరిక బలంగా లేదు. అందుచేత గట్టిగా చదువుతానని చెప్పలేదు.

"ఆలోచించుకో! ఎంట్రెన్స్ పరీక్ష రాయాలనుకుంటే మాత్రం రాయి" చెప్పాడు విఠల్ కొడుక్కి.

బాపన్న తండ్రిది మధ్యతరగతి కుటుంబం. వెనకాల ఆస్తులేమీలేవు భార్య ఒంటిమీది నగలు తప్ప. ఆయన బాపన్నతో చెప్పాడు.

"ఈ దేశంలో పెద్దకులాలవారికి కాని, ప్రతిభకి కాని ఎలాంటి భవిష్యత్తూ లేదు అన్నిట్లో రిజర్వేషన్స్. నీవు అమెరికా వెళ్ళి చదవాలనుకుంటే ఆ ప్రయత్నాలు చెయ్యి. అమ్మ నగలు అమ్మి అయినా పంపిస్తాను. కాకపోతే నీవు అక్కడికి వెళ్ళాక మాత్రం ఆ డబ్బు తిరిగి సంపాదించి పంపాలి. లేకపోతే నీ చెల్లెలి పెళ్ళి చేయలేం"

"అలాగే, నాన్నగారూ" చెప్పాడు బాపన్న.

అమెరికాలో ప్రతి ఇంట్లో చెత్తని  ప్లాస్టిక్ సంచిలో వేసి నింపుతారు. చదివేసిన పేపర్స్, పుస్తకాలు, ఖాళీసీసాలు, డబ్బాలు, కోడిగుడ్లు, పళ్ళతొక్కలు, పత్రికలు - ఒకటేమిటి, పనికిరానివన్నీ ఆ చెత్తసంచీల్లోకి వెళ్ళాల్సిందే ఇండియాలోలా పత్రికలను తీసుకోడానికి, ఖాళీసీసాలకు మార్కెట్ లేదక్కడ.

వారానికో నిర్ణీత దినం ఆ చెత్త సంచి బయట వుంచితే, దాన్ని లారిలో తీసుకుని వెళతారు.

శానోజేలో గార్బేజ్ సంచిని వెంకటేశ్వరరావు బయటకు తీసుకెళుతుంటే లక్ష్మి చెప్పింది.

"అదేమిటండీ, దీపాలు పెట్టాక, శుక్రవారం చెత్తను బయటికి కెళతారు?"

వెంకటేశ్వరరావు నవ్వుతూ చెప్పాడు.

"ఇండియాలో ఇపుడు శనివారం ఉదయం లేవే"

ఆ జోక్‌కి ఇంటిల్లిపాదీ నవ్వుకున్నారు. వాణి అనుకుంది. ఇండియా గుర్తుచేసుకోకుండా తన తల్లిదండ్రులకు రోజు గడవదని.

ఓ పోస్ట్‌కార్డు తీసుకుని అందులో ఇలా రాసింది.

శానోజే

**"హాయ్ స్టేన్లీ!**

ప్లీజ్ టిక్ వన్ బాక్స్.

() ఐ లవ్ యు

() ఐ డోంట్ లవ్ యు

() అదర్ రీజన్ ఫర్ నాట్ రిప్లైయింగ్.

**లవ్**

**వాణి"**

ఆ పిక్చర్ పోస్ట్‌కార్డుని పోస్ట్ చేసింది మర్నాడు. తను అమెరికా తిరిగి వచ్చాక స్టేన్లీకి రాసిన ఉత్తరానికి సమాధానం లేకపోవడంతో ఆమెకి కొద్దిగా ఆందోళనగా ఉంది. తన ఉత్తరం అందగానే అతనే ఫోన్ చేస్తాడని ఎదురుచూసింది. కానీ ఫోన్‌కాల్ రాకపోవడంతో ఆ కార్డు పంపించింది.

ఆ రాత్రి భోజనాలు చేస్తూంటే ఫోన్ మోగింది. లక్ష్మి రిసీవర్ అందుకుంటే ఆపరేటర్ చెప్పింది - హైదరాబాద్‌లోని చల్లా సుబ్బారావు అనే వ్యక్తి కలెక్ట్ కాల్ కోరుతున్నాడని, దాన్ని యాక్సెప్ట్ చేస్తారా అని.

లక్ష్మి సరేనని తన భర్తతో చెప్పింది.

"మీ తమ్ముడు. కలెక్ట్ కాల్"

ఆయన సుబ్బారావుతో మాట్లాడాడు. సుబ్బారావు భార్యవేపు బంధువులలో ఒకతను.

ఐ.టి.ఐ చేశాడు. ప్రస్తుతం హెచ్.ఏ.ఎల్ బెంగుళూరులో ఎలక్ట్రానిక్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు, పెళ్ళి చేసుకునే ఉద్దేశంలో ఉన్నాడు. అమెరికా సంబంధం కోసం చూస్తున్నాడు. పిల్లవాడు మంచివాడే ఈ సంగతులన్నీ చెప్పి అడిగాడు.

"పావనికి పెళ్ళిచేసే ఉద్దేశం యిప్పట్లో వుందా? ఆలోచించుకో. మళ్ళీ వారం తర్వాత ఫోన్ చేస్తాను."

వారం తర్వాత స్టేన్లీ ఆ కార్డుని ఓ కవరులో ఉంచి పంపాడు 'ఎంపోరియా' నుంచి.

అతను కేన్సాస్ స్టేట్‌లోని ఎంపోరియా అనే ఊళ్ళోని ఓ యూనివర్శిటీలో కంప్యూటర్ అనలిస్ట్‌గా పనిచేస్తున్నాడిప్పుడు.

ఆత్రంగా కవరు చింపి చదివింది వాణి.

స్టేన్లీ మూడో బాక్స్‌ని టిక్ చేసి పంపాడు.

వాణికి ఆ సమాధానం పెద్ద షాక్. ఇండియాలో ఉండగా తన ఉత్తరాలు అందగానే జవాబులు రాసిన స్టేన్లీ, ఎందుకు అకస్మాత్తుగా యింత మౌనంగా ఉండిపోయాడో ఆమెకు అంతుపట్టలేదు.

ఆ కార్డు చూడగానే అతనికి ఫోన్ చేద్దామనుకుంది కానీ చేయలేదు.

మర్నాడు గోల్డెన్ గేట్ బ్రిడ్జి పిక్చర్ పోస్టుకార్డు ఒకటి కొని దానిమీద ఇలా రాసి పోస్ట్ చేసింది.

**"హి.**

"ప్లీజ్ టిక్ వన్ బాక్స్ -

() ఐ ఫెల్ ఇన్ లవ్ విత్ ఎనదర్ గర్ల్.

() ఐ ఫెల్ అవుటాఫ్ లవ్ విత్ యు

() అదర్ రీజన్స్ ఫర్ నాట్ రైటింగ్.

**లవ్**

**వాణి.”**

వారం తర్వాత మళ్ళీ కలెక్ట్ కాల్ చేశాడు సుబ్బారావు - పెళ్ళికొడుకు కట్నం ఆశించడంలేదు. కులం పట్టింపు తప్ప, జాతకాల పట్టింపులేదు. పెళ్ళి ఇండియాలో ఘనంగా మాత్రం చేయాలి పెళ్ళికూతురు తరపువాళ్ళే పెళ్ళి ఖర్చు భరించాలి.

పావని తన తండ్రితో చెప్పింది - పెళ్ళికొడుకు తనను గురించి మాట్లాడిన వీడియో కేసెట్‌ని పంపించే ఏర్పాటు చేయమని ఫోన్‌లో వెంకటేశ్వరరావు అదే సూచించాడు. పావని ఫోటోలు సుబ్బారావుకి పంపాడు.

స్టేన్లీ నుంచి మళ్ళీ ఆ కార్డు వాణికి పోస్ట్‌లో ఓ కవర్లో వచ్చింది. ఈసారి ఆత్రంగా ఆ కవరు చింపింది. మూడో బాక్స్ టిక్ చేసి పంపాడు స్టేన్లీ.

వాణి కొద్దిసేపు ఆలోచించింది. తనను ప్రేమించడంలేదుట. ఇంకో అమ్మాయినీ ప్రేమించడం లేదుట. మరి అతని మనసులో ఏమున్నట్టు?

ఇంకో కార్డు తీసుకుని అందులో ఇలా రాసి పోస్ట్ చేసింది.

ప్లీజ్ టిక్ వన్ బాక్స్ -

() ఐ యామ్ ఆల్ రెడీ మేరీడ్

() ఐ యామ్ ఆల్ రెడీ ఎంగేజ్డ్

() అదర్ రీజన్స్ ఎట్సెట్రా

వీడియో కేసెట్ కొరియర్ సర్వీస్‌లో వచ్చింది. తన కుటుంబం ఉద్యోగం గురించి, తనకి ఎలాంటి భార్య కావాలో ఇంగ్లీషులో చెప్పాడా పెళ్ళికొడుకు. అతని పర్సనాలిటీ, మాటతీరు అందరికీ నచ్చాయి. అతను పావనికి నచ్చాడు. ముహూర్తాలు పెట్టుకోవచ్చని చెప్పాడు ఫోన్‌లో సుబ్బారావుకి వెంకటేశ్వరరావు.

స్టేన్లీ నుంచి వచ్చిన కవరు చూశాక అందులో తన కార్డు పంపాడని అర్థమైంది వాణికి. ఈసారి వెంటనే చింపలేదు ఆ కవరు. వాణికి కొద్దిగా భయంగా ఉంది. లోపల ఏ బాక్స్‌ని టిక్ చేశాడో అని. గట్టిగా ఊపిరి పీల్చుకుని వదిలి, కత్తెరతో కవరును కత్తిరించి, కార్డును బయటకు తీసి చూసింది.

మళ్ళీ మూడో బాక్స్‌ని టిక్ చేసి పంపాడు స్టేన్లీ.

వాణి ఆశ్చర్యం అధికమైంది. దాన్ని చూడగానే స్టేన్లీ మనసులో ఏముందో అర్థంకాలేదు. మర్నాడు ఇంకో పోస్ట్‌కార్డు తీసుకుని ఇలా రాసి పంపింది స్టేన్లీకి.

ప్లీజ్ టిక్ వన్ బాక్స్ -

() ఐ హేవ్ డిసైడెడ్ నాట్ టు మేరీ

() ఐ డోంట్ వాంట్ టు మేరీ యూ

() అదర్ రీజన్స్ ఎట్సెట్రా.

ఎప్పటిలాగానే మళ్ళీ స్టేన్లీ నుంచి వాణికి కవరు వచ్చింది ఈసారి ఎలాంటి ఆందోళనా లేకుండా ఆ కవరుని చింపి బయటకు తీసింది కార్డును.

మూడో బాక్స్ టిక్ చేసి ఉంది.

ఏమిటితను?

వాణి వెంటనే ఇంకో కార్డు తీసుకుని దాని మీద ఇలా రాసింది

ప్లీజ్ టిక్ వన్ బాక్స్ -

() మై మేరేజ్ ఈజ్ ఆల్‌రెడీ ఫిక్సెడ్

() ఎనదర్ గర్ల్ ఈజ్ గోయింగ్ టు బి మై వైఫ్

() అదర్ రీజన్స్ ఎట్సెట్రా..

మొదటిసారిగా వెంకటేశ్వరరావు కాబోయే అల్లుడు వెంకటరత్నంతో మాట్లాడాడు ఫోన్‌లో.

వెంకటరత్నం చదువు గురించి, ఉద్యోగం గురించి వివరాలడిగాడు. వచ్చే నెలల్లో ఇరవై తారీఖు ప్రాంతంలో ముహూర్తాలున్నాయని చెప్పాడు వెంకటరత్నం. తిరుపతిలో వివాహం జరిపించాలని కూడా కోరాడు.

తర్వాత పావని, వెంకటేశ్వరరావు ఇతర కుటుంబ సభ్యులుకూడా అతనితో మాట్లాడారు.

"ఫోన్‌లోనే నిశ్చితార్థం అయింది" చెప్పింది లక్ష్మి నవ్వి.

వాళ్ళింట్లో పెళ్ళి హడావుడి మొదలైంది.

స్టేన్లీ నుంచి ఈసారి కూడా మూడో బాక్స్‌లో టిక్‌తో వచ్చింది కార్డు.

అది చూడగానే వాణికి కించిత్తు కోపం వచ్చింది స్టేన్లీ మీద.

ఓ కార్డు మీద ఇలా రాసి పంపించింది.

ప్లీజ్ టిక్ వన్ బాక్స్ -

() ఐ వాంట్ టు కన్‌ఫ్యూజ్ యు

() ఐ యామ్ నాట్ కన్‌ఫ్యూజింగ్ యు

() అదర్ రీజన్స్ ఎట్సెట్రా

ఈసారి కూడా మూడో బాక్స్‌లో టిక్ వచ్చిన ఆ కార్డును చూసి వాణికి స్టేన్లీ మీద కోపం అధికమైంది.

సుబ్బారావు ముహూర్తం పెట్టించి అన్నయ్యకి తెలియచేశాడు. వచ్చే నెల ఇరవై రెండున తెల్లవారుఝామున ముహూర్తం తిరుపతిలో భీమాస్ పారడైజ్ హోటల్ లో అందరికీ పదిగదులు బుక్ చేస్తానని, కొండమీద కర్ణాటక రాష్ట్ర చౌల్ట్రీని పెళ్ళికి బుక్ చేస్తానని చెప్పాడు. అన్ని ఏర్పాట్లకి లక్షరూపాయలకి సర్టిఫైడ్ చెక్ (డ్రాఫ్ట్)ని తమ్ముడికి పంపాడు వెంకటేశ్వరరావు.

స్టేన్లీకి మళ్ళీ ఓ కార్డుని పంపింది వాణి.

ప్లీజ్ టిక్ వన్ బాక్స్ -

() ఐ యామ్ ఏన్ ఆల్కహాలిక్ నౌ

() ఐ యామ్ ఏ డ్రగ్ ఎడిక్ట్ నౌ

() అదర్ రీజన్స్ ఫర్ నాట్ రిప్లయింగ్.

పెళ్ళయి తిరిగి వచ్చాక రిసెప్షన్‌కి సంబంధించిన ఏర్పాట్లు చేశాడు వెంకటేశ్వరరావు. వెడ్డింగ్ కార్డ్స్ అమెరికాలో పరిచయస్తులందరికీ పోస్ట్ చేశాడు. సుబ్బారావుకి వందకార్డులు పంపించి బంధువులందరికీ పోస్ట్ చేయమని కోరాడు.

లక్ష్మి పెళ్ళయ్యాక ఓ నెలపాటు ఇండియాలో ఉండి వస్తుంది. సెలవు దొరకని కారణంగా వెంకటేశ్వరరావు పెళ్ళయిన రెండో రోజుకే తిరిగి వచ్చేస్తాడు పిల్లలతో.

పావని, లక్ష్మి కలిసి తిరిగి వస్తారు.

షరా మామూలే.

తిరిగి వచ్చిన ఆ కార్డులో మూడో బాక్స్‌లోని టిక్ చూశాక వాణికి చిర్రెక్కింది. స్టేన్లీకి ఫోన్ చేసి చెడామడా తిడదామనుకుంది. కానీ, తమాయించుకుని ఇంకో కార్డు పంపింది.

ప్లీజ్ టిక్ వన్ బాక్స్ -

() ఐ లాస్ట్ మై మేన్లీనెస్

() ఆల్ మై రిప్లయిస్ ఆర్ ఫాల్స్

() అదర్ రీజన్స్ ఎట్సెట్రా

ఈసారి వచ్చిన ఆ కవరులోని కార్డులో టిక్కు మూడో బాక్స్‌లో ఉంది. అది చూడగానే వాణి మనసులో ముల్లు గుచ్చుకున్నట్లు బాధ పడింది.

అతని దగ్గర నుంచి వచ్చిన అన్ని కార్డులూ దగ్గర పెట్టుకుని చదివి చూసింది.

ఇంకెవరినీ ప్రేమించడంలేదట. పెళ్ళి నిశ్చయం కాలేదట. ఇంకో అమ్మాయిని పెళ్ళి చేసుకోవాలనుకోవడంలేదట. పెళ్ళి అసలే కాలేదట. కానీ, తనను ప్రేమించడంలేదు.

ఆ తర్వాత అతనికి ఉత్తరం రాయాలనిపించలేదు. కానీ వాణి తనను గాయపరచిన స్టేన్లీని కూడా గాయపరచాలనుకుంది.

అదే అతనికి రాసే ఆఖరి ఉత్తరం అని కూడా అనుకుంది. ఓ కార్డు మీద ఇలా రాసి పంపింది.

హి మిస్టర్ స్టేన్లీ బ్రాడ్‌బరీ!

ప్లీజ్ టిక్ వన్ బాక్స్ -

() ఐ యామ్ ఏ హోమో

() ఐ యామ్ బై సెక్సువల్

() అదర్ రీజన్స్ ఎట్సెట్రా

18

వెంకటేశ్వరరావు 'హన్నా వరల్డ్ వైడ్ ట్రావెల్'కి ఫోన్ చేసి 'ఛలో ఢిల్లీ' స్కీమ్ కింద తన కుటుంబ సభ్యులకు ఢిల్లీకి కె.ఎల్.ఎం ఎయిర్‌లైన్స్‌లో రిటర్న్ టిక్కెట్లు బుక్ చేశాడు.

న్యూయార్క్ నుంచి వెలువడే కేవలం ఇండియన్స్‌కి ఆసక్తికరమైన వార్తలుండే 'న్యూస్ ఇండియా టైమ్స్' వీక్లీలో తన కూతురి పెళ్ళి గురించిన ప్రకటనను వెల్ విషర్స్ కోసం ఇచ్చాడు.

ఇండియాకి ఫోన్ కాల్స్ అధికమయ్యాయి. AT&T ట్రూ వరల్డ్ సేవింగ్స్ స్కామ్‌లో చేరబట్టి నిముషానికి ఇండియాకి కేవలం 78 సెంట్లు (24 రూపాయలు) మాత్రమే అందుకు ఖర్చు అవుతుంది. అయితే ఆదివారం మాత్రం ఈ సౌకర్యం లభిస్తుంది.

స్టేన్లీ నుంచి కార్డు వచ్చింది.

అందులో అతను టిక్ చేసిన బాక్స్‌ను చూడగానే వాణికి స్టేన్లీ మీద అసహ్యం వేసింది.

ఈసారి మొదటి బాక్స్‌ను టిక్ చేశాడు స్టేన్లీ.

అతను హోమోనా? కావచ్చు, యురోపియన్స్‌లో, అమెరికన్ మేల్స్‌లో ఈ మానసిక జాఢ్యం ఎక్కువ. లేక, తనను ఫూల్ చేయడానికో, సరదాకోసమో ఇలా చేస్తున్నాడా? 'ఐ లవ్ యూ డార్లింగ్' అని ఫోన్ చేస్తాడా?

ఇంకో కార్డుమీద ఇలా రాసి ఉంది.

ప్లీజ్ టిక్ వన్ బాక్స్.

() ఐ యామ్ నాట్ ఏ హోమో, ఐ లైడ్.

() ఐ యామ్ ఏ హోమో.

() జాన్, () జేన్, () బోత్.

ఈసారి వాణికి స్టేన్లీనుంచి కార్డుకాక లెటర్ వచ్చింది. చిన్ని లెటర్ అయినా స్టేన్లీ చెప్పదలచుకుంది స్పష్టంగా చెప్పాడు అందులో.

ఆరునెలల క్రితందాకా తను హెట్రో సెక్సువల్ అని, కానీ సెయింట్ లూయీ నుంచి ఎంపోరియాకి వెళ్ళాక తన వర్క్‌మేట్‌ద్వారా తనని తను 'డిస్కవర్' చేసుకున్నాడని, ఇపుడు ఆడవాళ్ళంటే ఎలాంటి ఉత్సాహం లేదని రాశాడు.

వాణికి బాధతోపాటు స్టేన్లీ మీద అసహ్యం కూడా కలిగింది.

స్టేన్లీ నిజస్వరూపం తెలిసినరోజే వాణి అక్కయ్య పెళ్ళికి శాన్‌ఫ్రాన్సిస్కో ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టునుంచి ఢిల్లీ బయలుదేరారు.

అది వాణికి ఎంతో మంచిదయింది.

స్థలం మార్పు, అక్కయ్య పెళ్ళి హడావుడి. ఆ పెళ్ళిలో చురుకుగా పాల్గొనడంతో తన మానసిక బాధను కొంతదాకా మరచిపోగలిగింది.

ఢిల్లీ నుంచి హైద్రాబాద్‌కి చేరుకున్నారు. మరునాడు సుబ్బారావు కుటుంబ సభ్యులతో, ఇతర బంధువులతో రైల్లో హైదరాబాద్ నుంచి తిరుపతికి బయలుదేరారు.

పెళ్ళి ఏర్పాట్లు చూడటానికి నాలుగురోజుల ముందే సుబ్బారావు తిరుపతి వెళ్ళాడు.

తమ పెళ్ళికి కొన్ని గంటల మునుపు పావని, వెంకటరత్నం ఒకరినొకరు మొదటిసారిగా చూసుకున్నారు. తమ సెలక్షన్‌లో తప్పులేదని ఇద్దరూ తృప్తిపడ్డారు.

పావని ఎలాంటి సిగ్గూ, జంకూ పడకుండా ఓ స్నేహితుడితో మాట్లాడుతున్నట్లుగా మాట్లాడింది అతనితో.

వెంకటరత్నం తల్లిదండ్రులకి కూడా కాబోయే కోడలు వచ్చింది.

టాక్సీలో అందరూ కొండమీదికి వెళ్ళారు. పెళ్ళి తిరుపతిలో కాబట్టి ముఖ్యమైనవాళ్ళే వచ్చారు.

పెళ్ళయిన మరునాడు వెంకటేశ్వరరావు స్వామివారికి కళ్యాణం చేయించాడు. నూతన దంపతులు తిరుపతిలో రిజిస్టర్ మేరేజ్ కూడా చేసుకున్నారు.

అందువల్ల మేరేజ్ సర్టిఫికెట్ వెంటనే వస్తుంది. తన బర్తను అమెరికాకు రప్పించడానికి ఆ డాక్యుమెంట్ చాలా ముఖ్యం. అందుకని సివిల్ మేరేజ్ చేసుకుంది పావని.

బెంగుళూరులో ఓ రిసెప్షన్‌కి హాజరయ్యాక వెంకటేశ్వరరావు వాణి, రవిలతో తిరిగి అమెరికాకు బయలుదేరాడు.

లక్ష్మి కాకినాడలో తన పుట్టింటికి వెళ్ళింది.

పావని, వెంకటరత్నం నైనిటాల్‌కి హనీమూన్‌కి వెళ్ళారు.

తర్వాత పావని బెంగుళూర్‌లో తన భర్తతో కాపురం చేసింది తిరిగి అమెరికా బయలుదేరేదాకా.

సంగీత వాళ్ళతో అమెరికాకు బయలుదేరింది ఆమెకీ వీసా రావడంతో.

పావని తన భర్తను అమెరికా రప్పించే కాగితాలను అటార్నీద్వారా తను వెళ్ళగానే ఫైల్ చేస్తానని చెప్పింది వెంకటరత్నానికి.

ఫ్లయిట్‌లో అడిగింది కూతుర్ని.

"అబ్బాయి ఒకే నే కదా?"

"ఒకేనే మమ్మీ"

"హమ్మయ్య మీ బాబాయి అతని గురించి అన్నివిధాలా వకబు చేసి సర్టిఫై చేశాడని, ఆయనమీద నమ్మకంతో పిల్లాడిని చూడకుండానే ఈ సంబంధం ఖాయం చేశాం. కానీ నాకు మనసులో బితుకు బితుకుమంటూనే ఉంది ఎలాంటివాడా అని"

నిజానికి తనను అమెరికా రప్పించే అమెరికన్ సిటిజన్‌షిప్ గల అమ్మాయి కాబట్టి ఏ ఇండియన్ మొగుడయినా తన భార్యతో సఖ్యంగా ఉంటాడు కొత్తలో.

అక్కడికి వెళ్ళగానే గ్రీన్‌కార్డ్ సంపాదించుకున్నాక అలాంటి మగాళ్ళ నిజస్వరూపాలు బయటపడుతూంటాయి.

కానీ సుబ్బారావు చెప్పినట్లు వెంకటరత్నం ముత్యంలాంటివాడు కాబట్టి, పావని అదృష్టవంతురాలే.

*( కొనసాగింపు వచ్చేనెలలో)*

**ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి**

www.anandbooks.com
www.telugubooks.in

Post your comments